జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 29 | సెప్టెంబర్ | 2025 ◆ పేజీలు : 7

## భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుతున్న గోదావరి

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- మరింత పెరిగే అవకాశం ఉందంటున్న అధికారులు



**భద్రాచలం, సెప్టెంబరు 28, ప్రజా జ్యోతి :** భద్రాచలం వద్ద గోదావరి తగ్గినట్లే తగ్గి మరోసారి వేగంగా పెరుగుతూ మొదటి ప్రమాద హెచ్చరిక అయిన 43 అడుగులు దాటి ప్రవహిస్తోంది. దీంతో జిల్లా కలెక్టర్ జితేష్వా పాటిల్ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో

మిగతా 2 లో...



ప్రస్తుత కాలంలో మనం అందరమూ తమ గుండె మీద చేయి వేసుకొని "హృదయమా.. పదిలమా"..! అనే ప్రశ్న వేసుకున్నట్లయితే దానికి ప్రస్తుత పరిస్థితుల్లో సమాధానం అంతగా దొరకకపోవచ్చు కేవలం పిడికెడు గుండె మానవుని జీవితాన్ని నిర్దేశిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సంవత్సరం "ఒక బీట్ మిస్ అవ్వకండి" అనే థీమ్ తో నిర్వహిస్తున్నారు.

● చర్ల, ప్రజాజ్యోతి

# హృదయమా... పదిలమా..!



7 లో..

- నేడు ప్రపంచ హృదయ దినోత్సవం
- ప్రతి ఏటా పెరుగుతున్న హృద్రోగులు
- వయసుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత వ్యాధులు
- అధిక కొవ్వు పదార్థాలతో గుండెకు ముప్పు
- ఆహారపు అలవాట్లలో జగ్రత్తలు, వ్యాయామాలు తప్పనిసరి
- గుండె వైద్య నిపుణుల సూచనలు



## లక్షలు దోచుకుంటున్న...
# ఇసుక మాఫియా

- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక దందా
- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వితే చర్యలు తప్పవు
- పేరుకే అనుమతులు... నిబంధనలు మాత్రం పాటించరు
- ట్రాక్టర్‌కు రూ.5 వేలు.. 6 వేలు వామ్మో
- ట్రాక్టర్ అనుమతి పత్రం తప్పనిసరి - సీఐ
- అక్రమ ఇసుక దందాను అడ్డుకునేదెవరు...?

**టేకులపల్లి, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:** రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో అడవి వాగులు, గుంటలు ఇసుకతో నిండి పోయాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న ఇసుక మాఫియా, ఇల్లందు నియోజకవర్గంలోని దట్టమైన అడవుల నుంచి నిర్బంధం లేకుండా

మిగతా 2 లో...







## పినపాకలో అమరారం
# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పై సస్పెన్షన్ వేటు

- ప్రజా జ్యోతి ప్రత్యేక కథనాలపై అధికారులు స్పందన
- అక్రమ వసూళ్లపై చర్యలు ప్రారంభం

2 లో..

**పినపాక , సెప్టెంబర్ 27 (ప్రజాజ్యోతి):** అమరారం ఫారెస్ట్ బీట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పై తక్షణ సస్పెన్షన్ వేటు పడింది. ప్రజా జ్యోతి ప్రచురించిన వరుస ప్రత్యేక కథనాల ఆధారంగా అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టి, అధికార దుర్వినియోగం, అక్రమ వసూళ్లు జరిగినట్టు నిర్ధారించారు. దాంతో పాటు సంబంధిత అధికారిపై శాఖా స్థాయి విచారణ కొనసాగుతోంది.



## భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుతున్న గోదావరి



(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా యంత్రాంగంను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాలు కురుస్తుండటంతో రామాలయ పరిసరాలు ముంపుకు గురి కాకుండా విస్తాకాంప్లెక్సు వద్ద నీటి మళ్లింపుకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి శనివారం రాత్రి 11 గంటలకు 42.70 అడుగులు ఉండగా ఆదివారం ఉదయం 6 గంటలకు 42.10 అడుగులకు తగ్గింది. అనంతరం మళ్లీ గంటకు ఒక అంగుళం చొప్పున పెరగడం ప్రారంభించింది. 9 గంటలకు 42.30, 12 గంటలకు 42.60, 3 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 43 అడుగులకు చేరుకుంది. 5గంటలకు 43.20 అడుగులకు చేరుకుంది. వరద మరో మూడు అడుగుల వరకు పెరిగి తగ్గే అవకాశాలు ఉన్నాయని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా భద్రాచలం వద్ద గోదావరి గత నెల రోజులుగా 30 అడుగులపైనే ప్రవహిస్తూ జెన్సీవాసులను ఇబ్బందులకు గురి చేస్తోంది. నెల రోజుల వ్యవధిలో ఆరుసార్లు మొదటి ప్రమాద హెచ్చరిక దాటి, రెండుసార్లు రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించింది. సెప్టెంబరు నెలలోనే వాలుగుసార్లు గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహిస్తోంది.

## అధికారికి ఘన సన్మానం



**ఇల్లందు, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జెకె 5 ఓసిలో డివై జియంగా పని చేస్తున్న కృష్ణ మోహన్ బదిలీపై వెళ్తుండగా ఆదివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో బ్రాంచ్ కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెకె 5 ఒసి ఫిట్ సెక్రటరి నాదెండ్ల శ్రీ నివాస్ రెడ్డి, నాయకులు చిక్క శ్రీను, వెంకటేశ్వర్లు, బొల్లెద్దుల శ్రీనివాస్, జక్కుల శ్రీనివాస్, పెరుగు వెంకటేశ్వర్లు, మగ్బుల్, షరీఫ్, అరికాల లక్ష్మణ్ రావు, తిరుమల్ రావు, కోటయ్య, అంజయ్య, నర్సయ్య, సయ్యద్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## వీరలక్ష్మి అలంకారంలో అమ్మవారి దర్శనం



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:** పట్టణం లోని బ్రాహ్మణ వీధిలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ప్రతి రోజూ భిన్నమైన అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తుండగా, ఆదివారం (ఏడవ రోజు) వీరలక్ష్మి అలంకారం భక్తులను ఆకట్టుకుంది. కవచాలంకారం, శోభాయమానమైన పుష్పాలతో అలంకరించిన అమ్మవారు, వీరలక్ష్మి రూపంలో సింహాసనంపై కూర్చొని భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. వీరలక్ష్మి రూపం శౌర్యానికి, ధైర్యానికి ప్రతీకగా భావిస్తారని, ఈ దర్శనం కలిగిన వారికి జీవితంలో అడ్డంకులు తొలగిపోవడంతో పాటు ఆత్మస్థైర్యం, శక్తి లభిస్తుందని పురోహితులు వివరించారు. శరన్నవరాత్రి పరిసరాలు భక్తుల నినాదాలతో మార్మోగాయి. వందలాది మంది అమ్మవారిని సేవించి తరించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా, సాయంత్రం హారతులను భక్తి, శ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు అమరవాది మురళి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ అమ్మవారి దయకు పాత్రులై అందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సంతోషభరిత జీవితం పొందాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రులలో భాగంగా రాబోయే రోజులలో మరిన్ని ఆహ్లాదకరమైన అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు.

### పినపాకలో అమరారం

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పై సస్పెన్షన్ వేటు

**పినపాక , సెప్టెంబర్ 27(ప్రజా జ్యోతి ):**అమరారం ఫారెస్ట్ బీట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పై తక్షణ సస్పెన్షన్ వేటు పడింది. ప్రజా జ్యోతి ప్రచురించిన వరుస ప్రత్యేక కథనాల ఆధారంగా అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టి, అధికార దుర్వినియోగం, అక్రమ వసూళ్లు జరిగినట్టు నిర్ధారించారు. దాంతో పాటు సంబంధిత అధికారిపై శాఖా స్థాయి విచారణ కొనసాగుతోంది.




**››› ప్రజా సమస్యలపై ప్రజా జ్యోతి కలం కదలింది**

వన్యప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు, చిన్న రైతులు అడవి ఉపాధి పనుల కోసం, మైను అనుమతుల కోసం అధికారిని కలిసిన సందర్భాల్లో అనధికారికంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ప్రజా జ్యోతి గడచిన వారంలో ప్రచురించిన రెండు విడత కథనాల్లో ఈ వివరాలు చర్చకు తెరతీశాయి. పలు గ్రామాల ప్రజలు తమ అనుభవాలను మీడియా ముందు వెల్లడించారు. వారి వాంగ్మూలాలు, ఆడియో రికార్డులు, వీడియో రికార్డుల ద్వారా సేకరించిన విజువల్స్ ఆధారంగా జరిగిన ఈ స్పెషల్ స్టోరీలు అధికార యంత్రాంగాన్ని అలర్ట్ చేశాయి.

**››› విచారణ తాలూకు వివరాలు**

అటవీ శాఖ మండల అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ
బీట్ పరిధిలోని అమరారం, ప్రజల నుండి మౌఖిక, పత్రాధారాల ద్వారా సాక్ష్యాలు సేకరించగా, వాటిలో చాలా వరకు ఆరోపణలు సత్యమని తేలింది.

**విచారణలో బయటపడిన ముఖ్య అంశాలు:**

**››› రైతుల వద్ద నుండి ఫారెస్ట్ అనుమతుల పేరిట ఎకరానికి 1,000 రూ. నుండి 2000 రూ. వరకు వసూలు.**

**››› సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ**

అటవీ శాఖ జిల్లా అధికారి కార్యాలయం నుండి అధికారికంగా విడుదలైన ఉత్తర్వుల్లో, "ప్రాథమిక విచారణలో అధికార దుర్వినియోగం స్పష్టమైంది. తుదివిచారణ పూర్తయ్యే వరకు సంబంధిత బీట్ ఆఫీసర్ ను విధుల నుండి తప్పిస్తున్నాం," అని పేర్కొన్నారు.

**››› ప్రజల స్పందన – పత్రిక పట్ల అభినందనలు**

స్థానిక గ్రామాల ప్రజలు, ఉద్యమకారులు, రైతు సంఘాల ప్రతినిధులు ప్రజా జ్యోతి పాత్రను ప్రశంసించారు. "ఇలాంటివి బయటకు రావడానికి మీడియా మాత్రమే మార్గం. మా మాటకు ఇన్నేళ్లుగా విలువ లేదు. ఇప్పుడు వాస్తవాలు బయటకు వచ్చాయి," అని వివిధ గ్రామస్తుల ప్రజలు తెలియజేశారు.

**››› అధికారుల హెచ్చరిక**

ఈ నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు ఇతర బీట్ అధికారులను హెచ్చరిస్తూ, "ప్రజల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలి. అధికార స్థానాన్ని దుర్వినియోగం చేస్తే ఉపేక్షించం," అన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా అన్ని బీట్ లను రివ్యూ చేయనున్నట్లు సమాచారం

**››› ప్రతినిధి వ్యాఖ్య**

ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడానికి విలేకరి కలం ఎంత శక్తివంతమో ఈ సంఘటన మళ్లీ చూపించింది. ప్రజల జీవనాధారంగా ఉన్న ప్రభుత్వ వ్యవస్థలే వారికి భారంగా మారినప్పుడు, మీడియా జోక్యం తప్పనిసరిగా మారుతుంది. ప్రజా జ్యోతి ఈ పాత్రను మరోసారి నిబద్ధతతో నెరవేర్చినందుకు అభినందనీయంగా మారింది.

# లక్షలు దోచుకుంటున్న ఇసుక మాఫియా

(మొదటి పేజీ తరువాయి...)

ఇసుక తవ్వకాలు చేసి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇసుక నాణ్యత బట్టి ఒక్క ట్రాక్టర్ కు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్లు రాత్రింబవళ్లు నిరాటంకంగా అడవుల నుంచి ఇసుకను తరలిస్తుంటే, ఫారెస్ట్ అధికారులు మాత్రం నిశ్చలంగా ఉంటున్నారని ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

**››› స్థానికులపై కఠినం – మాఫియాపై మౌనం**

సాధారణ గ్రామస్థులు చిన్న మొత్తంలో ఇసుక తెచ్చుకోవాలన్నా అనుమతులు తప్పనిసరి. పర్మిషన్ లేకుండా తెస్తే అధికారులు కేసులు పెట్టి ఇబ్బంది పెడతారు. కానీ వందలాది ట్రాక్టర్లు బహిరంగంగా ఇసుకను తరలిస్తున్నా ఆపడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. "పేద ప్రజలపై కఠినం, మాఫియాపై మౌనం ఎందుకు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**››› అడవికి, పర్యావరణానికి ముప్పు**

అడవిలో నిరంతర తవ్వకాలతో నేల దెబ్బతింటూ, భారీ వర్షాలకు పెద్దపెద్ద వృక్షాలు నేలకూలుతున్నాయి. వృక్ష సంపద తగ్గిపోవడంతో భవిష్యత్ తరాలు ఆక్సిజన్ కొనే పరిస్థితి వస్తుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అడవి ప్రాంతాలు క్రమంగా ఖాళీ అవుతుండటం గమనించదగ్గ అంశమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**››› పర్మిషన్ పేరుతో దందా**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం పంచాయతీలు లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇసుక ఇవ్వాలని అనుమతులు ఇస్తున్నాయి. ఒక్క ట్రాక్టర్ ఇసుక రూ.3



వేలకే దొరకాలి. కానీ ట్రాక్టర్ యజమానులు ఈ పర్మిషన్లను సాకుగా చూపించి లబ్ధిదారులకు కాకుండా బయట గ్రామాలకు రూ.5 వేల – రూ.6 వేలకే అమ్మేస్తున్నారు. దీంతో ఇందిరమ్మ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతుండగా, అక్రమార్కులు రెండు మూడు వేల అదనంగా వసూలు చేసి లాభాలు గడిస్తున్నారు.

**››› అక్రమ ఇసుక దందాను అడ్డుకునేదెవరు...?**

మండల పరిధిలోని పలు గ్రామాల్లో రోజుకు మూడు పూటలా ఇసుక రవాణా కొనసాగుతోంది. ఒకో గ్రామంలో రోజుకు ఆరు పైగా ట్రాక్టర్లు నిరాటంకంగా తిరుగుతున్నాయి. ఈ అక్రమ దందాతో కాలువలు, చెరువులు, కుంటలు నష్టపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

"అధికారులకు సమాచారం ఇచ్చినా, డయల్ 100కి ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కసారి వచ్చి చుట్టుపక్కల చూసి వెళ్లిపోతారు. తర్వాత అదే పరిస్థితి కొనసాగుతుంది" అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**››› పేరుకే అనుమతులు... నిబంధనలు మాత్రం పాటించరు**

పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే 2 నుంచి 4 టిప్పుల ఇసుకకు అనుమతులు ఇస్తున్నారు. కానీ ట్రాక్టర్ యజమానులు ఈ సమయ పరిమితులను పట్టించుకోకుండా రాత్రివేళల్లో కూడా రవాణా చేస్తున్నారు. ఇసుక తరలింపు నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు.

**››› అధికారుల నిఘా కరువు**

కిన్నెరసాని, ముర్రేడు, తెల్లవాగు, ఓసి వాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర గ్రామాలకు ఇసుక తరలింపులు సాగుతున్నాయి. రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక కూడా దొరకదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**››› నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వితే చర్యలు తప్పవు**

"ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇసుక పర్మిషన్ తీసుకున్నవారు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు. అక్రమ రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం" అని తహసీల్దార్ వీరభద్రం హెచ్చరించారు.

**››› ట్రాక్టర్ అనుమతి పత్రం తప్పనిసరి - సీఐ**


"ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు తప్పనిసరి. 18 ఏళ్ల పైబడినవారే ట్రాక్టర్ నడపాలి. మద్యం తాగి వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేస్తాం" అని సీఐ బత్తుల సత్యనారాయణ స్పష్టం చేశారు

# ఘనంగా అంతర్జాతీయ సంజ్ఞా భాషా దినోత్సవ వేడుకలు



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:**కలెక్టరేట్ కార్యాలయం లోని ఐ.డి.ఓ. సి. నందు ఘనంగా అంతర్జాతీయ సం జ్ఞా భాష దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనిన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం అంతర్జాతీయ సంకేత భాష పోస్టర్ ను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా లెనీన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని. సొసైటీలో బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా, ఉద్యోగాలలో బధిరులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు, అర్హులైన అందరికీ సహాయ ఉపకరణాలు అందిస్తామని, వారి సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే జిల్లా కలెక్టర్ , వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కు సమస్యలను వివరించి వాటిని పరిష్కరించే విధంగా చూస్తామన్నారు, అనంతరం కొత్తగూడెం జిల్లా బదిరుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగా రెడ్డి మాట్లాడుతూ బదిరులు ఎక్కడికి వెళ్లినా సంకేత భాష విషయంలో తమ సమస్యను పక్క వారికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు అందరికీ సైగల భాష పై అవగాహన కల్పించాలని, రవాణా శాఖ ద్వారా బధిరులకు డ్రైవింగ్ విషయంలో లైసెన్స్ మంజూరు చేపించాలని, వికలాంగుల నియామకాలు రిజర్వేషన్లను భర్తీ చేయాలని, బధిరులకు కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, మహిళలకు కుట్టుమిషన్ , కంప్యూటర్ శిక్షణలు ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బధిరుల సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ కిషన్, ఖమ్మం జిల్లా అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అధ్యక్షుడు వీరస్వామి, సెక్రటరీ మహేష్ కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బదిరుల సంఘం సెక్రటరీ ఇంతియాజ్ ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ ప్రసన్న ప్రియ , అనువాదకులు అంకిత,కార్యాలయ సిబ్బంది నరేష్ , ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయాలను ప్రసాదించే విజయలక్ష్మి అమ్మవారు



**భద్రాచలం, సెప్టెంబరు 28,ప్రజాజ్యోతి :**భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవా ల్లో భాగంగా అమ్మవారు ఆదివారం విజయ లక్ష్మి అలంకారంలో భక్తులకు ద ర్శనమిచ్చారు. శక్తిదా విజయప్రదా.... అంటూ పురాణాలు కీర్తిసుంటాయి. మ నం ఏ కార్యాన్ని తలపెట్టామో అందులో విజయం వైపు అడుగులు వేసేలా మ నల్ని ప్రోత్సహిస్తుంది అమ్మ. అనేక గొప్ప కార్యక్రమాలు, గొప్పదైన శుభపరంపరంను ప్రసాదించే విజయలక్ష్మి అమ్మవారిని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయని వైదిక సిబ్బంది వివరించారు. విజయలక్ష్మి అలంకారంలో ఉన్న అమ్మవారికి తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సామూహిక కుంకుమార్చన, విష్ణు సహస్రనామ పారాయణం వైదిక సిబ్బంది పఠించారు. చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్రావు వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. నేడు అమ్మవారు అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. నేడు అమ్మవారు ఐశ్వర్య లక్ష్మి ఆలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## పంచకట్టు వేడుకలో పాల్గొన్న ఆల్ పెన్షనర్స్ సంఘు అధ్యక్షులు




భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ నాయకులు వడ్డే రాంబాబు మనవళ్ళు చేతన్ సాయి, వేదాంత ఈశ్వర సాయి లకు పంచకట్టు వేడుకలను పాల్వంచ పెద్దమ్మ తల్లి గుడి వద్ద ఉన్న అమ్మ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు ఎస్. రాజబాబు, టి. శివప్రసాద్, మురళీకృష్ణ, విష్ణు, మొలకల సుబ్రహ్మణ్యం తదితరులు హాజరై చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ వార్డు ఇన్చార్జిల నియామకం

**భద్రాచలం, సెప్టెంబరు 28,ప్రజాజ్యోతి :**భద్రాచలం పట్టణంలో 20 వార్డులకు బీఆర్ఎస్ పార్టీ వార్డు ఇన్చార్జిలను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు నియమించారు. ఒకటో వార్డుకు ఉడతా రమేష్, రెండో వార్డుకు రేపాక పూర్ణచంద్రరావు, మూడో వార్డుకు కోలా రాజు, 4వ వార్డుకు తుమ్మలపల్లి ధనేశ్వరరావు, 5వ వార్డుకు లంకపల్లి విశ్వనాథం, 6వ వార్డుకు పాపినేని సాయి రామాంస, 7వ వార్డుకు కోటగిరి ప్రమోద్ కుమార్ , 8వ వార్డుకు కుంచాల సదానందం, 9వ వార్డుకు కొల్లం జయప్రేమ్ కుమార్ , 10వ వార్డుకు కావూరి సీతామహాలక్ష్మి, 11వ వార్డుకు పూజల లక్ష్మి, 12వ వార్డుకు శివ ప్రసాద్, 13వ వార్డుకు అంబటికర్ర కృష్ణ, 14వ వార్డుకు అయినాల రామకృష్ణ, 15వ వార్డుకు మురాల డానియేల్ ప్రదీప్, 16వ వార్డుకు కాపుల సూరిబాబు, 17వ వార్డుకు పసుపులేటి రమేష్, 18వ వార్డుకు తెల్లం కామేశ్వరి, 19వ వార్డుకు బద్ది బాబీ, 20వ వార్డుకు బత్తుల నరసింహులను నియమించారు. మండల కన్వీనర్లు ఆకోజు సునీల్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావులు పాల్గొన్నారు.

## ఒకే ప్రయత్నంలో రెండు విజయాలు

- భద్రాచలం యువకుడు భరత్ చంద్ర ప్రతిభ



**భద్రాచలం ,సెప్టెంబర్ 28,ప్రజా జ్యోతి :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన బాదావత్ భరత్ చంద్ర ఒకేసారి గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షల్లో ప్రతిభ కనబరచి విశేష కీర్తి సాధించారు.తాజాగా వెలువడిన గ్రూప్–1 ఫలితాల్లో భరత్ చంద్ర ప్రతిష్టాత్మకమైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) పదవిని పొందగా, గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 150వ ర్యాంకు, జోన్‌లో గిరిజన వర్గంలో మొదటి ర్యాంకు సాధించి నాయబ్ తహసీల్దార్ హోదా దక్కించుకున్నారు.భరత్ చంద్ర తండ్రి గోవింద్ ప్రభుత్వ ఉపాధ్యాయులు కాగా, తల్లి సుమతి గృహిణి. భరత్ చంద్ర పదో తరగతి వరకు భద్రాచలంలోనే విద్యనభ్యసించి, అనంతరం హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తరువాత భారతీయ సాంకేతిక విద్యా సంస్థ పాట్నా నుండి బీటెక్ చేసి, ఢిల్లీలో సివిల్ సర్వీసుల శిక్షణ పొందారు. కృషి, పట్టుదలతో రెండు పరీక్షల్లోనూ అగ్రవిజయం సాధించడం విశేషమని అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## హిందూపురం ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు



**భద్రాచలం టౌన్ సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:** హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ హీరో బాలకృష్ణ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై భద్రాచలం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాళ్లూరు చిట్టిబాబు పట్టణ సీఐ నాగరాజుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. హిందూపురం ఎమ్మెల్యే పై రెడ్డిపాలెం గ్రామానికి చెందిన బిజ్జం వెంకటేశ్వరరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు కుటుంబ సభ్యులపై కూడా అవమానకర వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలకృష్ణ ని కాల్చివేయాలన్న విధంగా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మహబూబా బాద్ పార్లమెంటు ఉపాధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, సొసైటీ అధ్యక్షులు అబ్బినేని శ్రీనివాసరావు, నూతలపాటి దాసయ్య, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లను పుట్టనిద్దాం... ఎదగనిద్దాం!

- ఉత్సాహంగా సాగుతున్న బతుకమ్మ ఉత్సవాలు



**భద్రాచలం (టౌన్), సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:**ఆడపిల్లను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం అని ఐద్వా అధ్యక్షురాలు సీతాలక్ష్మి, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆది, సతీష్ బాబు అన్నారు. ఆదివారం రాజుపేట, అశోక్‌నగర్, కొత్తకాలనీ, జగదీశ్ కాలనీ, రామాలయ ప్రాంతాల్లో జరిగిన బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ఆడపిల్లల ఆవశ్యకతను చాటి చెప్పే పండుగగా చరిత్రలో నిలిచిందని గుర్తు చేశారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలు, వివక్షత పెరుగుతున్న తరుణంలో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని వివరించారు. బతుకమ్మ వేదికలపై ఆడపిల్లలకు లభించే హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని 20 వార్డు కమిటీల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల్లో ఐద్వా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, రాధా, జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన దర్బారుకు అధికారులు సకాలంలో హాజరు కావాలి



**భద్రాచలం, సెప్టెంబరు 28,ప్రజాజ్యోతి :**భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నేడు నిర్వహించే గిరిజన దర్బారు కార్యక్రమంకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ మన తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన తెలపారు. యూనిట్ అధికారులు 10.30 గంటల వరకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరు కావాలని తెలిపారు.

## పేదోడి సొంతింటి కలను కలగానే మిగులుస్తున్న పాలకులు

- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:**భద్రాచలంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి అర్హులైన పేదలకు తక్షణమే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాస్ లైన్ కార్యక్రమంలో భాగంగా మనుబోతుల చెరువు, ఏఎం సి కాలనీలలో నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి పేదలకు ఇల్లు కలగానే మిగిలిపోతుందని, టిఆర్ఎస్ చేసిన తప్పునే కాంగ్రెస్ కూడా పునరావృతం చేస్తోందని విమర్శించారు. తొమ్మిది ఏళ్లలో భద్రాచలంలో 4 వేల మందికి పైగా లబ్ధిదారులు ఉన్నా కేవలం 265 ఇండ్లు మాత్రమే ఇచ్చారని, కొత్త ప్రభుత్వం కూడా రెండు సంవత్సరాలు అవుతున్నా అసంపూర్తి ఇండ్లను పూర్తి చేయలేదని అన్నారు. ఎన్నికల హామీల్లో చెప్పిన ఇందిరమ్మ ఇండ్లకూ ఇప్పుడు కోతలు పెడుతున్నారని మండిపడ్డారు.మూడు నెలల క్రితం ప్రారంభించిన ఇండ్లలో రోడ్లు, డ్రైన్లు వంటి సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదల అర్జీలు పెద్ద సంఖ్యలో వస్తున్నందున అసంపూర్తి ఇండ్లను పూర్తి చేసి ఇవ్వాలని, ఖాళీ స్థలం ఉన్న పేదలకు నిబంధనలు సడలించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదల ఇంటి సమస్య పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎం.బి. నర్సారెడ్డి, గడ్డం స్వామి, సున్నం గంగా, వి.సంతోష్ కుమార్, ధనకొండ రాఘవయ్య, ఎస్.డి. ఫిరోజ్, నకిరేకంటి నాగరాజు, అజయ్ కుమార్, సంద్ర భూపేంద్ర, సతీష్ బాబు, రాజలింగం పాల్గొన్నారు.

## దిశ ఉమెన్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- స్థానిక పోలీస్ స్టేషన్లో ఘనంగా.



**జూలూరుపాడు సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడుకేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో దిశ ఉమెన్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై భాదావత రవి హాజరయ్యారు. ఉమెన్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ సభ్యులు ఎస్సై ని సన్మానించారు, అనంతరం ఆటపాటలతో బతుకమ్మలు ఆడారు. ఎస్ఐ మాట్లాడుతూ తెలంగాణలో ఆడపడుచులు ఘనంగా జరుపుకునే పండుగ బతుకమ్మని ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. దిష వెల్ఫేర్ ప్రొటెక్షన్ సభ్యులు ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు రేవతి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు మాధవి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కోడెం సీతా కుమారి కుదురుపాక నిర్మల సీత,మల్లేశ్వరి,అమలా,కృష్ణవేణి పద్మ,రాజేశ్వరి,సామ్రాజ్యం బతుకమ్మలను పేరిచి ఆట పాటలతో సందడి చేశారు.

## చాకలి ఐలమ్మ మనవరాలు శ్వేతకు జెన్కో ఎంప్లాయిస్ సన్మానం



**పాల్వంచ(రూరల్), సెప్టెంబర్ 28,ప్రజా జ్యోతి:** కేటీపీఎస్ ఏ కాలనీ గెస్ట్ హౌస్లో జెన్కో ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ మనవరాలు,తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేతను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ తొలగించిన విద్యుత్ సంస్థ స్థానంలో కొత్త కర్మాగారం నిర్మించాలని,బి టీ పి ఎస్, వై టీ పి ఎస్ కు పంపిన ఉద్యోగులను తిరిగి కేటీపీఎస్లో నియమించి వారికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.జెన్కో ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకు అశోక్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు ముదిగొండ సత్యనారాయణ, మడిపెడ్డి వెంకట సోములు సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బి.వి.ఆర్, ధర్మరాజుల నాగేశ్వర రావు,చిట్యాల సోమయ్య, రెడ్డి రాజుల వెంకట్, కందుకూరి శ్రీనివాస్,గుమ్మడి రాజుల మధు,మడిపెడ్డి శ్రీకాంత్, ప్రశాంత్,పోచారం శ్రీను,కుమ్మరి కుంట్ల సురేష్,ప్రవీణ్,యాదగిరి, ముదిగొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పిటిసి,ఎంపిటిసి రిజర్వేషన్ ప్రక్రియలో షెడ్యూల్ కులాలకు అన్యాయం

- జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు పూలరవీందర్



**కొత్తగూడెం, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి ):** జిల్లాలో స్థానిక జడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్ ప్రక్రియలో షెడ్యూల్ కులాలకు అన్యాయం జరిగిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు పూలరవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.రిజర్వేషన్ల విషయంలో 2024 లో చెపట్టిన కులగణన ఆధారంగా 42% ఇస్తే, ఎస్సీలకు మాత్రం 2011జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ కేటాయించడం దుర్మార్గం అని ఎస్సీలకు ఉన్న 15%రిజర్వేషన్ నిన్న ప్రకటించిన స్థానిక రిజర్వేషన్ లలో కనపడలేదు అని జిల్లా మొత్తం 22 జడ్పీటీసీ లకు గాను 1జడ్పీటీసీ,ఎంపీపీ అయితే అసలే లేదు, జిల్లా మొత్తం 233 ఎంపీటీసీలకు 5 ఎంపీటీసీలు కేటాయించడం ఏ ప్రాధిపదికనా చేసారో చెప్పాలని, భారత రాజ్యాంగం ఒకరికి ఒకలా ఇంకొకరికి ఇంకోలా ఉండదు అని అందరికి సమానమే అని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎలక్షన్ లలో ఓటమి భయంతో ఇటువంటి కుట్రలు పన్నుతున్నదని దీనిని ప్రజలందరూ గమనిస్తున్నారు అని ఇకనైనా షెడ్యూల్ కులాలు విషయంలో ప్రభుత్వం ఆలోచన చేయాలి అని లేని పక్షంలో స్థానిక ఎలక్షన్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదు అని హెచ్చరించారు.

# కాంకేర్ లో ఎన్ కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- మృతిచెందిన వారిలో ఇద్దరు పురుషులు ,ఒక మహిళ
- మృతి చెందిన మావోయిస్టులపై 14లక్షల రివార్డ్
- ఆయుధాలు ,పేలుడు పదార్ధాలు స్వాధీనం



राजेश उर्फ राकेश हेमला
एसीएम/नगरी एरिया कमेटी/गोबरा
एलओएस कमाण्डर



सरवन मडकम उर्फ विश्वनाथ
उर्फ बुधराम ACM मैनपुर
नुआपाड़ समन्वय टीम



बसंती कुंजाम उर्फ हडमें
पीएम/समन्वय/प्रोटेक्शन टीम
मैनपुर-नुआपाड़ा सदस्य

**చర్ల , సెప్టెంబర్ 28: (ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ కాంకేర్ జిల్లాలోని ఉత్తర బస్తర్ పోలీస్ స్టేషన్లోని చింద్ఖరక్ గ్రామంలోని అటవీ-కొండ ప్రాంతంలో ఆదివారం పోలీసులు మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి . డి ఆర్ జి బృందం , బి ఎస్ ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్లో ఈ ఎన్కౌంటర్ జరిగింది.ఈ ఎన్ కౌంటర్ లో మృతి చెందిన ఇద్దరు పురుష ఒక మహిళా మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఐ కె ఎల్లిసెల ఈ సంఘటనను ధ్రువీకరించారు. ఎన్కౌంటర్లో మరణించిన మృతి చెందిన మావోయిస్టుల వివరాలు సర్వాన్ మడ్కం అలియాస్ విశ్వనాథ్ అలియాస్ బుధ్రామ్ పూనెం -ఏ సి ఎం , సీతానది /రావస్ కోఆర్డినేషన్ ఏరియా కమిటీ- కార్యదర్శిగా అతనిపై 8 లక్షల రివార్డు, రాజేష్ అలియాస్ రాకేష్ హేమ్లా - ఏ సి ఏం , నగరి ఏరియా కమిటీ /గోబ్రా ఎల్ ఓ ఎస్ కమాండర్ అతనిపై 5 లక్షల రివార్డు, బసంతి కుంజమ్ అలియాస్ హిడ్మే - పీ ఏం , కోఆర్డినేషన్/ప్రొటెక్షన్ టీం మెయిన్పూర్-నువాపాడ సభ్యురాలు . 1 లక్ష రివార్డు ఉన్నాయి. మృతి చెందిన నక్సలైట్లపై మొత్తం రూ. 14 లక్షల రివార్డు ప్రకటించారు. ఘటన స్థలం నుంచి ఒక ఎస్ ఎల్ ఆర్ ,ఒక .303 రైఫిల్, ఒక 12 బోర్ ఇతర నక్సలైట్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.బస్తర్ రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ సుందర్రాజ్ పి. (ఐపీఎస్), డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ శ్రీ అమిత్ తుకారాం కాంబ్లే (ఐపీఎస్), బిఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ శ్రీ విపుల్ మోహన్ బాలా, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఐ.కె. ఎల్లిసెల (ఐపీఎస్), గరియాబంద్ పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ నిఖిల్ రఖేచా (ఐపీఎస్) సంయుక్త ప్రకటనలో, డిఆర్జి బిఎస్ఎఫ్ సంయుక్త బృందం షెడ్యూల్ చేసిన కార్యక్రమం ప్రకారం ఈ శోధన ఆపరేషన్ ప్రారంభించారు .ఈ ఆపరేషన్ సమయంలో అనుమానాస్పద కార్యకలాపాల ఆధారంగా అడవిలో శోధన నిర్వహిస్తూఉండగా ఆ సమయంలోనే ఈ ఎన్కౌంటర్ జరిగింది అని ఎన్కౌంటర్ తర్వాత సంఘటనా స్థలంలో క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించగా, పైన పేర్కొన్న మావోయిస్టును, పెద్ద మొత్తంలో ఆయుధాలు ఇతర సామగ్రిని కనుగొన్నారు అని మృతదేహాల ప్రాథమిక గుర్తింపు తరువాత దర్యాప్తు కొనసాగుతోంది తదుపరి చట్టపరమైన చర్యలు పోస్ట్మార్టంలు పూర్తవుతున్నాయి అని అధికారులు అన్నారు .భౌగోళిక పరిస్థితు లు వాతావరణం క్లిష్టంగా ఉన్నప్పటికీ, బస్తర్లో మోహరించిన పోలీసులు భద్రతా దళాలు ప్రజల ప్రాణాలను ఆస్తులను రక్షించడానికి సిద్ధంగా ఉన్నాయని ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్రాజ్ పి. పేర్కొన్నారు. మావోయిస్టు కార్యకర్తలు హింసను విడిచి పెట్టి, ప్రభుత్వ పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకుని జన జీవన స్రవంతిలోకి తిరిగి రావాలని లేకుంటే వారు కఠినమైన చర్యలను ఎదుర్కొంటారని ఆయన విజ్ఞప్తి చేశారు.

## దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన కింగ్ మన భగత్ సింగ్

- ఘనంగా జయంతి.
- ఆరోగ్య జీవన యాత్ర సభ్యుల ఆధ్వర్యంలో.



**జూలూరుపాడు, సెప్టెంబర్ 28 ( ప్రజా జ్యోతి ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కేంద్రంలో గల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం భగత్ సింగ్ జయంతిని ఆరోగ్య జీవన యాత్ర వాకింగ్ యోగ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి భగత్ సింగ్ ధైర్య సాహసాలను మెచ్చుకున్నారు ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ భగత్ సింగ్ సర్దార్ అనే సంస్థను స్థాపించి. ఇంక్విల్యాబ్ అనే నినాదంతో ముందుకు వచ్చి జనాన్ని చైతన్యవంతం చేశాడు కుటుంబ నేపథ్యం విప్లవ కుటుంబం కావడంతో చిన్నవయసులోనే అన్యాయాన్ని ఎదిరించే మనసును అలవర్చుకున్నాడని మంచి ధైర్య సాహసాలు ఉన్న వ్యక్తి అని 13 సంవత్సరాలవయసులోనే గాంధీ అహింస మార్గాన్ని అనుసరిస్తూ ఉద్యమంలో పాల్గొన్నారు అనంతరం అహింస మార్గంలో ఉండలేక తిరుగుబాటు చేసి అతివాదిగా మారి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి బ్రిటిష్ అధికారిని కాల్చి చంపిన ఘటనలో భగత్ సింగ్ సుఖదేవ్ రాజ్ గురువులకుమరణశిక్షకు పందుల భగత్ సింగ్ అతి చిన్న వయసువాడు అలాంటి ధైర్య సాహసాలు ఉన్న వ్యక్తి యొక్క గుణగణాలను ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని . ముఖ్యంగా యువత ఆదర్శంగా తీసుకోవాలని దేశం కోసం తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారని అతని సేవలు మరువలేవని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతి జరుపుకోవడం ఎంతో సంతోషమని ప్రతి ఒక్కరూ భగత్ సింగ్ ధైర్యసహసాలను పునికి పుచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు శివ,బోసు,శంకర్రావు,కమలాకర్, శ్రీనివాసరావు,బుడెన్ పాషా,కుమార్,నాగేశ్వరరావు,వెంకట్, దయానంద్, గురునాథం భాస్కర్,నరేష్,నవీన్, సురేష్ సింగ్. సత్యనారాయణ, రమేష్లు పాల్గొన్నారు.

## పోరాట ప్రతిమ కలిగిన వ్యక్తి కొండలరావు

- వర్ధంతి సందర్భంగా పూల మాలలు వేసిన మచ్చ వెంకటేశ్వర్లు

**జూలూరుపాడు,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** సి.పి.ఎం పార్టీ జూలూరుపాడు మండల మాజీ కార్యదర్శి వెంగాన్నపాలెం మాజీ ఎంపీటీసీ గా పని చేసిన యాస కొండలరావు నాలుగో వర్ధంతి సందర్భంగా వారి స్తూపం వద్ద జిల్లా మండల నాయకులు ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనటువంటి సి.పి.ఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు కొండల రావు ఫోటోకు పూలదండ వేయడం, పతాక ఆవిష్కరణ చేయడం జరిగింది.అనంతరం మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యాస కొండల రావు జూలూరుపాడు మండలంలో ఉన్నటువంటి ప్రజలందరికీ పని చేసి ప్రజల అభిమానాలు సొంతం చేసుకున్నారని అన్నారు. ఎన్నో ఏళ్లగా స్థానికంగా పత్తి మార్కెట్ ఉండాలని పోరాటం చేసి దాన్ని సాధించుకున్న ఘనత సి.పి.ఎం దేనని అన్నారు. ఆ పత్తి మార్కెట్ కు అప్పుడు కార్యదర్శిగా ఉన్న యాస కొండలరావు చేసిన కృషి నేడు మండలంలో పత్తి మార్కెట్ రావడానికి కారణమని అన్నారు. కొండలరావు తమ జీవితాన్ని పార్టీ కంకితం చేసి పార్టీ శ్రేయస్య లక్ష్యంగా ఎన్నో ఆటుపోటులు ఎదుర్కొని వాటన్నిటినీ పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. దేశంలో బిజెపి రాష్ట్రంలో పార్టీలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేయాలని అలాంటి పోరాటం చేసినప్పుడే కొండలరావుకు నిజమైన నివాళులర్పించడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీని తక్షణమే అమలు చేయాలని కోరారు. మండలంలో ప్రజా సమస్యల పరిష్కారాన్ని సి.పి.ఎం పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని అన్నారు. సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేసే ఏకైక పార్టీ సి.పి.ఎం పార్టీ అని గుర్తు చేశారు అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యల సమస్యలుగా భావించి ముందుండి మిలిటెంట్ పోరాటాలకు ఎల్లవేళల మండల కమిటీ సభ్యులుగ ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో గడిదేసి కనకరత్నం, ఊడల వెంకటేశ్వర్లు, పద్దం సుగుణ, రెడ్డి బోయిన గోవిందు, వల్లమళ్ల చందర్ రావు, బానోతు మధు, జల్లి రాధాకృష్ణ, మాలోత్ రాములు పాల్గొన్నారు.



# అడవి బిడ్డల హక్కులను పాలక ప్రభుత్వాలు కాపాడాలి

- లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి
- భద్రాద్రి నుంచి ఆదిలా బాద్ వరకు ఆదివాసీ ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయి
- భద్రాచలంలో ఆదివాసీ ధర్మయుద్ధం
- బహిరంగ సభలో ఆదివాసీ జేఏసీ నాయకుల స్పష్టీకరణ
- తెలంగాణ, చత్తీస్ గడ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేల మంది ఆదివాసీలు
- మూడు కి.మీ. మేర భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహణ




భద్రాచలం, సెప్టెంబరు 28,ప్రజా జ్యోతి :ఆదివాసీ అడవి బిడ్డల హక్కులను కాపాడుకునేందుకు పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని, ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించి అడవి బిడ్డలకు న్యాయం చేయాలని ఆదివాసీ ధర్మయుద్ధం మెహిరంగ సభలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చుంచు రామకృష్ణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, జేఏసీ రాష్ట్ర నాయకులు మోడెం శ్రీనివాస రావు, మాజీ ఎంపీ సోయం బాబు రావు, రేగా కాంతారావు, పొదెం వీరయ్యలు పిలుపునిచ్చారు. భద్రాచలంలో ఆదివారం జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జరిగిన ఆదివాసీల ధర్మయుద్ధం బహిరంగసభలో వారు మాట్లాడారు. లంబాడీలను తక్షణమే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 1976 రాజ్యాంగ సవరణ ద్వార లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల అసలైన ఆదివాసీలు గోండు, కోయ, కోలాం వంటి తెగల వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రిజర్వేషన్ల పేరుతో ఆదివాసీల హక్కులను నష్టం కలిగిస్తున్న లంబాడీలను తరిమి కొట్టాలని వారు కలుపునిచ్చారు. చట్టబద్ధత లేని లంబాడీలను తక్షణమే తొలగించాలని, దీనిపై పాలక ప్రభుత్వాలు స్పందించాలన్నారు. దేశంలో పలు రాష్ట్రాల్లో బీసీలుగా ఉన్న లంబాడీలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో మాత్రం ఎస్టీలుగా గుర్తించడం, ఆదివాసీలకు లభించే అన్ని రిజర్వేషన్ సదుపాయలను వారు పొందుతుండటంతో ఆదివాసీల్లో అభివృద్ధి జాడ లేకుండా పోతోందన్నారు. భద్రాచలం అనంతరం మళ్లీ దేపావలి తరువాత ఆదిలాబాద్లో ఐదు రాష్ట్రాల ఆదివాసీలతో బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, ఇకపై ఆదివాసీ ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. తక్షణమే ఎస్టీ జాబితా సమీక్ష చేపట్టాలని, లేనిపక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ ఫలాలు లంబాడీలు అధికంగా పొందుతున్నారని దీని వల్ల ఆర్థికంగా, సామాజికంగా బాగా వెనుకబడిన ఆదివాసీలు మరింత వెనుకబడుతున్నారని అన్నారను. అటవీ ప్రాంతాల్లో దశాబ్దాలుగా జీవిస్తున్న తమ హక్కులు కాలరాయబడుతున్నాయని తమకు రావాల్సిన రిజర్వేషన్ వాటా దక్కడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు బూర్గంపాడు మండలం సారపాక నుంచి భద్రాచలంలో బహిరంగ సభ వేదిక వరకు మూడు కి.మీ. వేల సంఖ్యలో ఆదివాసీలో భారీ ర్యాలీ నిర్వహించారు. భద్రాచలం పట్టణమంతా ఆదివాసీలతో నిండిపోయింది. ఈ కార్యక్రమాల్లో ఆదివాసీ నాయకులు తాటి వెంకటేశ్వర్లు, మానె రామకృష్ణ, తెల్లం సీతమ్మ, పూనెం కృష్ణ, పాయం రవి వర్మ, ముర్ల రమేష్, బట్టా హరికృష్ణలు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు




పాల్వంచ(రూరల్), సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:స్వాతంత్ర్య ఉద్యమ వీరుడు సర్దార్ భగత్ సింగ్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు.ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూభగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలని,భగత్ సింగ్ జయంతి అధికారికంగా నిర్వహించాలని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో పొందుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు.అతను మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థి,యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సృజన్ వినయ్,ఉపాధ్యక్షుడు సంజయ్, జిల్లా సమితి సభ్యులు రాజ్ కమల్, నాయకులు హర్మాన్,కళ్యాణ్, మహేష్ వరుణ్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# చండి దేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి



ఇల్లందు టౌన్, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి: పట్టణంలోని 24 ఏరియాలో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం శ్రీ దుర్గాదేవి చండి దేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజు రోజువారీ కుంకుమ పూజా కార్యక్రమాలతో పాటు ప్రతిరోజు ప్రత్యేకమైన అవతారాల్లో శ్రీ దుర్గాదేవి భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు నిర్వాహకులు, పూజారి తెలిపారు.

# వైభవంగా పెద్దమ్మ గుడిలో ఉత్సవాలు

- చండీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



పాల్వంచ(రూరల్), సెప్టెంబర్ 28,ప్రజా జ్యోతి:పాల్వంచ మండలం,కేశవాపురం–జగన్నాథపురం గ్రామంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మ గుడి)లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పెద్దమ్మతల్లిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఈ రోజు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఖమ్మం జిల్లా సహాయ కమీషనర్ & మేడారం కార్యనిర్వహణాధికారి ఎం.వీరస్వామి పెద్దమ్మగుడికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అర్చకులు ఆశీర్వచనంతో పాటు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదం అందజేశారు.సాయంత్రం నీరాజన మంత్రపుష్పం,తీర్థప్రసాద వితరణ అనంతరం రాత్రి 8 గంటలకు శ్రీ కిన్నెర కళాసమితి వి.కొండల్రావు బృందం నిర్వహించే భక్తి గీతాల కార్యక్రమం జరగనుంది.రేపు సోమవారం (మూల నక్షత్రం) సందర్భంగా సామూహిక అక్షరారంభాలు జరుగుతాయి.ఈ సందర్భంగా అమ్మవారు “శ్రీ సరస్వతీదేవి” అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు.

### ››› టెండర్లు – బహిరంగ వేలం:



దేవస్థాన కార్యాలయం ప్రకటన ప్రకారం,ఈ నెల 30న ఉదయం 11 గంటలకు ఆలయానికి చెందిన కొత్త కాంప్లెక్స ని షాపులు,పాత కాంప్లెక్సని షాపులు,చీరల ప్రోగు, పూల–పూలదండల లైసెన్సు హక్కులు, స్క్రాప్ అమ్మకానికి సీల్డ్ టెండర్ బహిరంగ వేలం నిర్వహించబడుతుంది.ఉత్సవాలకు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు చీకటి కార్తీక్,పాటు అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడు

- మతోన్మాద శక్తులను ఓడించడమే భగత్ సింగ్ కు నిజమైన నివాళి
- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె ఫహీమ్ దాదా




కొత్తగూడెం,సెప్టెంబర్ 28(ప్రజాజ్యోతి):షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి ఎస్ కే, ఫహీమ్ దాదా అన్నారు.షహీద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం లోని టూ ఇంక్లైన్ దగ్గర ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కే, ఫహీమ్ దాదా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని కొనియాడారు.1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్ సింగ్ 23 ఏళ్ళ చిరు ప్రాయంలోనే 1931 మార్చ్ 23న తన సహచరులు రాజ్ గురు, సుఖ్ దేవ్ తో కలిపి ఉరితీయబడ్డారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావ శీల విప్లవకారులలో భగత్ సింగ్ అగ్రగణ్యుడని, ఈ కారణంగానే షాహీద్ గా దేశ ప్రజలు కొనియాడారని గుర్తు చేశారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యూం ఉపాధ్యక్షులు బరిగెల భూపేష్ జిల్లా కౌన్సిల్ మెంబర్ రసూల్ పాషా, పట్టణ నాయకులు సల్మాన్, మణికంఠ, అప్రోచ్, సంజయ్, జావీద్, అక్షయ్, రవి, రణధీర్, వంశీ, అన్మోల్, అమన్, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

- మహిళలతో ఆడిన ఎమ్మెల్యే కోరం





ఇల్లందు, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి:పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలను పేర్చి వాటి చుట్టూ ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మహిళలు ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు ఆడిన కోలాట నృత్యం పలువురుని ఆకట్టుకున్నాయి. నియోజకవర్గ ప్రజలందరూ ఈ పండగ పూట సుఖశాంతులతో గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యదళ్లపల్లి అనసూయ, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దమ్మపేటలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం

- **మూడు లారీలు సీజ్, 60 టన్నుల ఇసుక స్వాధీనం**

**దమ్మపేట, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా పై ఎస్.ఐ బి.సాయి కిషోర్ రెడ్డి ఉక్కుపాదం మోపారు.ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా దమ్మపేట ఎస్.ఐ బి.సాయి కిషోర్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ 1418, హోంగార్డు 913తో కలిసి ఆదివారం ముష్టిబండ గ్రామ పరిసరాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించిన సందర్భంగా మూడు లారీలు అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడగా, మూడు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు ఎస్.ఐ బి.సాయి కిషోర్ రెడ్డి తెలిపారు. మొదటి ఘటన లో క్రైమ్ నంబరు 242/2025, సెక్షన్ 318(4) బీఎన్ఎస్, – ఉదయం 6 గంటల సమయంలో బుడిద వెంకన్న మునుగోడు మండలం, నల్గొండ జిల్లా వాసి, లారీ నం. TS30TA6189లో 20 టన్నుల ఇసుకను ప్రభుత్వ అనుమతి లేకుండా రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. ఈ లారీ యజమాని నేవురి చంద్రశేఖర్ రెడ్డి కాగా, అక్రమ రవాణా చేయించిన వారు కోవ్వూరి గోపాలకృష్ణ, సత్తుపల్లి మండలం వాసి.రెండవ ఘటన లో క్రైమ్ నంబరు 243/2025, సెక్షన్ 318(4) బీఎన్ఎస్, – ఉదయం 8.30గంటలకు జడువు సురేష్(33సంవత్సరాలు), హైదరాబాద్ వాసి, లారీ నం. TS30TA4679లో 20 టన్నుల ఇసుకను అనుమతి లేకుండా రవాణా చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ లారీ యజమాని నరేంద్ర రెడ్డి కాగా, ఈ అక్రమ రవాణా చేయించిన వారు కోవ్వూరి గోపాలకృష్ణ.మూడవ ఘటనలో క్రైమ్ నంబరు: 244/2025 సెక్షన్ 318(4) బీఎన్ఎస్, – ఉదయం 11 గంటల సమయంలో ముదుపు ఉపేంద్ర రెడ్డి (37 సంవత్సరాలు), మునుగోడు మండలం, నల్గొండ జిల్లా వాసి, తన స్వంత లారీ నం. TS07UK8969లో 20 టన్నుల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ఈ అక్రమ రవాణా చేయించిన వారు కూడా కోవ్వూరి గోపాలకృష్ణగానే గుర్తించారు.ఈ మూడు కేసుల్లో మొత్తం మూడు లారీలు, 60 టన్నుల ఇసుక, దాదాపు రూ.60,000/- విలువైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పంచనామా ఆధారంగా కేసులు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్.ఐ బి.సాయి కిషోర్ రెడ్డి స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాపై ఎవర్ని వదిలిపెట్టేది లేదని ,చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ బి.సాయి కిషోర్ రెడ్డి హెచ్చరించారు.

## ఎనిమిది అంతరాలుగా బతుకమ్మ వెన్న ముద్దల బతుకమ్మ సంబరాలు




**అశ్వారావుపేట, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి:** పెత్తర అమావాస్యతో మొదలైన తొమ్మిదిరోజుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఆదివారం 8రోజుబతుకమ్మ పండుగను ఆడపడుచులు వెన్నముద్దల బతుకమ్మగా జరుపుకున్నారు. బతుకమ్మను తంగేడు, గునుగు, చామంతి, గులాబీ, గడ్డి పువ్వు పూలతో మరింత ఎత్తుగా అంటేఎనిమిది అంతరాలుగా బతుకమ్మగా పేర్చి.. ఆలయాల దగ్గరకు తీసుకొచ్చి ఆడబిడ్డలంతా చేరి ఆట,పాటలతో బతుకమ్మను కొలుచుకొని వాయనంగా నువ్వులు, బెల్లం కలిపి ప్రసాదంగా పంచిపెట్టుకున్నరు.ఇప్పటికే ఎంగిలి పువ్వు బతుకమ్మ, అటుకల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి.

## రేపు కలెక్టరేట్‌లో ప్రజావాణి జరగదు

**భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల నిర్వహణలో అధికారులు నిమగ్నమై ఉండటంతో రేపు (29-09-2025, సోమవారం) జరగవలసిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయబడిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు తమ వినతిపత్రాలు, దరఖాస్తులు, ఫిర్యాదులను కలెక్టర్ కార్యాలయం ఇన్‌వర్డ్ విభాగంలో సమర్పించవచ్చని, వాటిని సంబంధిత శాఖలకు పంపబడుతాయనిసూచించారు.

## కనకదుర్గ మండపం వద్ద అన్నదానం



**టేకులపల్లి, సెప్టెంబర్28, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని పెగల్లపాడు (ప) తెలుగూరు గ్రామంలో కొలువుధీరిన కనకదుర్గమ్మ దేవి నవరాత్రులలో భాగంగా ఆదివారం అమ్మవారి సన్నిధిలో మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోయగూడెం మాజీ సర్పంచ్ కోరం ఉమా సురేందర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి,అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలోపిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్, టేకులపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఎస్సె ఆలకుంట రాజేందర్, సొసైటీ డైరెక్టర్ లక్కినేని శ్యామ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కినేని మురళీ, జింకల రాజు,గోవర్ధన్, హనుమంతు, సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

## మహాశక్తి స్వరూపిణి మహాచండి దేవి



**అశ్వారావుపేట, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:** మహాచండీ దేవి మహాశక్తి స్వరూపిణి అని ఈ దేవిని ఈ రూపంలో అలంకరించడం ద్వారా శక్తి సామర్థ్యాలు పెరుగుతాయన్నాయని, పౌరాణికంగా చూస్తే దేవి పూజ ఏకాగ్రతతో, భక్తితో చేయబడినపుడు అవాంఛిత శక్తులు నశించి, శుభఫలాలు సిద్ధిస్తాయని అనేక పురాణాలు చెబుతున్నాయని సాయిబాబా ఆలయం వద్ద అర్చకులు పుండరీకాక్ష అన్నారు. దేవీ శరన్న నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గం వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తుండగా ఆదివారం కనకదుర్గమ్మ శ్రీమహాచండీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం, శ్రీ కోదండరామలయం, గుర్రాల చెరువు గ్రామశివారులోని స్వయంభుగా వెలసిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయం, డ్రైవర్స్ కాలనీ శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయాలతో సహా పలు ఆలయాలలో భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి నివేదనలు అందించారు.

**అత్యంత శక్తి వంతమైన దైవ అలంకారం... అర్చకులు పుండరీకాక్ష**

శ్రీ మహాచండీదేవి అలంకారం హిందూ సంప్రదాయంలో అత్యంత శక్తివంతమైన, పవిత్రమైన దైవ అలంకారమని, ఈ అలంకారం ద్వారా దేవిని సమ ర్థవంతంగా ఆరాధించడం ఆమె సాక్షాత్కారాన్ని పొందడవలన శుభాలుకలుగుతాయి అని అర్చకులు పుండరీకాక్ష అన్నారు ముఖ్యంగా శక్తిపూజలో ఈ అలంకారం అత్యంత ప్రాముఖ్యతను సంతరించు కుందని, విశ్వాసంతో చేసేమహాచండీఅలంకారపూ జ, సాధకునిదుర్వ్యవస్థలు తొలగించి,జీవితంలోసక ల సౌభాగ్యాలు ప్రసాదిస్తుందన్నారు. షిర్డీసాయి సేవ సమితి అధ్యక్షులు హంబి హరిబాబు, మంగదొడ్డి మురళీకృష్ణ, కేథ ధనరాజు,ముళ్ళపూడి సూరిబాబు, విమలశ్రీదేవి, పృధ్వి, పుప్పాల శివ శంకర్, పావని, రమాదేవి, స్వప్న, గౌరీ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## భగత్ సింగ్ 118 వ జయంతి వేడుకలు

**టేకులపల్లి, సెప్టెంబర్28, ప్రజా జ్యోతి:** భారత స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చేసిన ప్రాణత్యాగం నేటితరం యువతకు అర్థం కావాలని సిపిఐ జిల్లా నాయకులు,మాజీ ఏఐఎస్ఎఫ్ గుగులోత్ రామ్ చందర్ అన్నారు.సిపిఐ జిల్లా నాయకులు గుగులోత్ రామ్ చందర్ ఆధ్వర్యంలో ఆదివారం జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు, పువ్వులు వేసి నివాళులు అర్పించారు.అనంతరం మాట్లాడుతూ భగత్ సింగ్ త్యాగం నేటి యువతకు ఆదర్శం అని ఆయన పేర్కొన్నారు. అటువంటి మహానీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలియజేసే బాధ్యత పాలకులదేనని వారు అన్నారు.మరణం భారత దేశ ప్రజల్లో ఎంతో స్వాతంత్ర స్ఫూర్తి,చైతన్యం నింపిందన్నారు.నేటి యువత వారి త్యాగాలను తెలుసుకొని సామాజిక బాధ్యతతో, దేశభక్తితో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అందుకోసం మేధావులు భగత్ సింగ్ చేసిన త్యాగాలను సమాజంలో చాటి చెప్పాలన్నారు. భగత్ సింగ్ జయంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని తెలియజేశారు.తక్షణమే భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి యువతకు ఉద్యోగాలు కల్పించాలని వారు తెలియజేశారు.ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని అన్నారు.భగత్ సింగ్ భారత దేశ స్వతంత్రం కోసం చేసిన పోరాటం ఆలోచనలు ఆయన చూపిన కార్యచరణ మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయనితో అన్నారు.యువజనులతో మమేకమై ఉత్తేజ భరితమైన ఉద్యమాలు సాగిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్ఫూర్, జబ్బర్,వర్షిత్, కార్తీక్,మోహన్, చిన్న,కమల్,రవీందర్,యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## జనాభా ప్రాతిపదికనా రిజర్వేషన్ ఖరార్ చేయాలి

- **పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్**

**టేకులపల్లి, సెప్టెంబర్28, ప్రజాజ్యోతి:** జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్ ఖరారు చేయాలని పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ డిమాండ్ చేశారు.టేకులపల్లి మండల కేంద్రంలో జరిగిన ప్రగతిశీల యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ పాల్గొని, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపీటీసీ,గ్రామ పంచాయతీ వార్డులు జనాభా కనుగుణంగా కాకుండా ఇష్టాను రీతిలో రిజర్వేషన్ కల్పించడం సరైనది కాదని ఆయన డిమాండ్ చేశారు.గత ఎన్నికల్లో ఎలా అయితే రిజర్వేషన్ కల్పించారో ఆ ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించకపోవడం దీని వెనక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.అదేవిధంగా రొటేషన్ పద్ధతిలో కాకుండా జనాభా ప్రాతిపదిగిన రిజర్వేషన్ కల్పించక పోవడంతో అభివృద్ధికి నష్టం కలిగే అవకాశం ఎక్కువగా ఉందని ఆయన ఆరోపించారు. వెంట నే రిజర్వేషన్ ప్రక్రియను పున పరిశీలించి తక్షణమే డ్రా పద్ధతి కాకుండా పాత పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయస్థానం మెట్లు ఎక్కవలసిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన తెలిపారు.ఇప్పటికైన ప్రభుత్వం జనాభా ప్రాతిపదికనాగా రిజర్వేషన్ కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో దశ వారిగా ఆందోళన కార్యక్రమం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం మండల కార్యదర్శి తోటకూరి సతీష్ కుమార్,మండల అధ్యక్షులు కోడెం రవి,నాయకులు భూక్య లక్ష్మణ్, జార్జి,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## పూసుకుంట గ్రామానికి తక్షణం బీటీ రోడ్డు నిర్మించాలి : సిపిఎం పార్టీ డిమాండ్



**దమ్మపేట, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామంలో ఆదివారం సిపిఎం పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం గ్రామ నాయకుడు మడివి విజయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన సిపిఎం పార్టీ దమ్మపేట మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పూసుకుంట గ్రామానికి తక్షణమే బీటీ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందని, అవసరమైన చోట కల్వర్టులు, వంతెనలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, వీధులలో సిమెంట్ రోడ్లు వేయాలని, ప్రతి బజారుకు విద్యుత్ లైన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. పోడు సాగుదారులందరికీ పట్టా హక్కు పత్రాలు ఇవ్వాలని, ఫారెస్ట్ శాఖ దాడులు నిలిపివేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 అందించాలన్నారు. వలస ఆదివాసీలకు ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారి నివాస ప్రాంతాల్లో అంగనవాడి భవనాలు నిర్మించి, పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ములకలపల్లి మండల సిపిఎం కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు ముదిగొండ రాంబాబు, జిల్లా రైతు సంఘం నాయకుడు ఊకంటి రవికుమార్, మండల పార్టీ నాయకులు, జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు మడివి విజయ్, సోడే ఉమేష్, మడివి గంగులు, మడివి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# హృదయమా... పదిలమా..!



- నేడు ప్రపంచ హృదయ దినోత్సవం
- ప్రతి ఏటా పెరుగుతున్న హృద్రోగులు
- వయసుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత వ్యాధులు
- అధిక కొవ్వు పదార్థాలతో గుండెకు ముప్పు
- ఆహారపు అలవాట్లలో జగ్రత్తలు, వ్యాయామాలు తప్పనిసరి
- గుండె వైద్య నిపుణుల సూచనలు

**ప్రస్తుత కాలంలో మనం అందరమూ తమ గుండె మీద చేయి వేసుకొని "హృదయమా.. పదిలమా"..! అనే ప్రశ్న వేసుకున్నట్లయితే దానికి ప్రస్తుత పరిస్థితుల్లో సమాధానం అంతగా దొరకకపోవచ్చు కేవలం పిడికెడు గుండె మానవుని జీవితాన్ని నిర్దేశిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సంవత్సరం "ఒక బీట్ మిస్ అవ్వకండి" అనే థీమ్ తో నిర్వహిస్తున్నారు.**

● చర్ల, ప్రజాజ్యోతి

ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమంలో గుండె జబ్బులు గుండెకు సంబంధించిన తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వైద్య నిపుణులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు ముఖ్యంగా తెలియజేస్తుంది ఏమనగా మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు ఒత్తిడి నిద్రలేమి ఇలా ఇతరత్రా కారణాల వలన మన గుండె ఒత్తిడికి లోనవుతుందని వాటి వలన గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తమ గుండెను జాగ్రత్తగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అది మన చేతుల్లోనే ఉన్నదని చెబుతున్నారు. మనం ప్రతినిత్యం తీసుకునే ఆహారంలో ఎక్కువగా కొవ్వు ఉండే పదార్థాలను జంక్ ఫుడ్ లను తీసుకోవడం వలన గుండెకు సరఫరా అయ్యే రక్తనాళాలలో కొవ్వు పేరుకొనిపోయి హార్ట్ పెయిన్, హార్ట్ ఎటాక్, కార్డియాక్ అరెస్ట్ లాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని అంటున్నారు .ఈ ఆహార అలవాట్లు వలన రాను రాను వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు చిన్న వయసు వారి దగ్గర నుంచి పెద్ద వయసు వారిలో దాకా కనిపిస్తూ ఉన్నాయని అంటున్నారు. గుండె జబ్బులకు ప్రధాన కారణాలుగా రక్తపోటు, మధుమేహము,అధిక కొవ్వు , కిడ్నీ సంబంధిత వ్యాధులు కూడా గుండె జబ్బు వ్యాధులకు కారణాలవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వలన



ఇతర వత్తిడి వలన శరీరంలో అధిక రక్తపోటు పెరిగి ఆ ఒత్తిడి వలన గుండెకు సరఫరా అయ్యే నాళాలలో రక్తము గడ్డ కట్టి స్ట్రోక్ లాంటి ప్రమాదాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఉప్పుతో కేవలం గుండెకే కాకుండా కిడ్నీ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉన్నదని వైద్యులు హెచ్చరిస్తున్నారు .మధుమేహ వ్యాధిగ్రస్తులు మందులను క్రమం తప్పకుండా వేసుకోవాలని మధుమేహ వ్యాధి వలన కూడా గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉన్నదని సరైన జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు. శారీరక శ్రమ లేకపోవడం కూడా గుండె జబ్బులకు ప్రధాన కారణం అని వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి 30 నిమిషాల శారీరక శ్రమను ప్రతి రోజూ చేయటం వలన ఇది గుండెను బలపరుస్తుంది అని శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తుంది అని తద్వారా ఊబకాయం, రక్తపోటు, కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తుంది అని గుండె వైద్య నిపుణులు చెపుతున్నారు.

### ››› గుండెకు ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలు:

అందరు ప్రతినిత్యం ఎక్కువ సేపు మెలకువగా ఉండడం, మొబైల్ ఫోన్ లను ఎక్కువగా ఉపయోగించడం వల్ల గుండెపై ప్రతికూల ప్రభావం పడుతుంది అని అటువంటి పరిస్థితిలో ప్రతినిత్యం తగినంత నిద్ర (7-8 గంటలు) తీసుకోవటం, ఒత్తిడిని తగ్గించడానికి యోగా, ధ్యానం వలన ఇది శరీరం ఒత్తిడి స్థాయిని తగ్గించి గుండెకు వత్తిడిలేకుండా ప్రయోజనకరంగా ఉంటుంది అని మద్యపానం ,ధూమపానం, అధిక కొవ్వు పదార్థాలను తీసుకోకుండా ఉన్నట్లయితే గుండె జబ్బులు నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

### ››› ఆహారపు అలవాట్లతో గుండె జబ్బుల నియంత్రణ :

మనం ప్రతినిత్యం తీసుకునే ఆహారంలో ఆకు కూరలు ఉండేలా చూసుకోవాలని ఈ ఆకు కూరలు గుండెకు ఎంతో మంచిది అని క్యాన్సర్ వంటి రోగాలను సైతం దరిచేరనివ్వవు అని పాలకూర, కొత్తమీద, ర్యాడిష్ మొదలైన వాటిలో కొవ్వు శాతం తక్కువ ఉండటంతో పాటు ఫోలిక్ యాసిడ్, మెగ్నీషియం, కాల్షియం, పోటాషియం ఎక్కువగా లభిస్తాయి అని ఇవి గుండె పనితీరును మెరుగు పర్చడంలో ఎంతో సహాయపడతాయి అని రోజూ ఆహారంలో భాగంగా ఇవి తీసుకునేవారికి మిగిలిన వారితో పోలిస్తే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు చాల శాతం తక్కువగా ఉంటాయి అని వైద్యుల సుచిస్తున్నారు .సాధారణంగా చేపలు ఎక్కవగా తినేవారిలో గుండె సంబంధిత వ్యాధులు తక్కువేనంటున్నారు వైద్య నిపుణులు. చేపల్లో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ గుండె పనితీరును మెరుగు పరుస్తాయి అని అంటున్నారు .

మనం ప్రతినిత్యం తీసుకునే ఉప్పును కూడా తక్కువ మోతాదులో తీసుకున్నట్లయితే రక్తపోటుని అదుపులో ఉంచుకుని తద్వారా గుండె సంబంధిత వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు అని వైద్యులు సూచిస్తున్నారు.గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణం ఒత్తిడి అని దానిని జయించినట్లయితే చాలా వరకు గుండె సంబంధిత వ్యాధుల నుంచి బయటపడవచ్చు అని గుండె సంబంధిత సమస్యను గుర్తించి సకాలంలో చికిత్స పొందడం చాలా ముఖ్యం అని కాబట్టి మీ గుండెను క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకొని వైద్య నిపుణుల సలహాను పాటిస్తూ ఉంటే కొంతకాలం పాటు అందరు తమ "హృదయాన్ని...పదిలంగా..."కొంత కాలం పాటు గుండె సంబంధిత వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని వైద్యులు సుచిస్తున్నారు .

